సాక్షి
ప్రకాశం
గురువారం । 26 । అక్టోబర్ । 2023



పల్లె ముంగిట.. సంక్షేమ బావుటా..
గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.24.60 కోట్లు మంజూరు చేసింది. వాటితో 36 మండలాల్లో 460 పనులు చేపట్టనున్నారు. - 8లో..



బాల్య వివాహాలను నిలువరించాలి
జిల్లాలో బాల్య వివాహాలపై ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉంటూ నిలువరించాలని కలెక్టర్ దినేష్ కుమార్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
36.8/25.6

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది. రాత్రి చల్లని గాలులు వీస్తాయి. పగలు ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

కరణం వెంకటేష్‌కు బాలినేని పరామర్శ



కరణం వెంకటేష్‌ను పరామర్శిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చీరాల వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌ను మాజీమంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి బుధవారం పరామర్శించారు. ఆస్పత్రికి చేరుకుని వైద్యం జరుగుతున్న తీరును గురించి వైద్యులను అడిగి తెలుసుకోవడంతోపాటు త్వరగా కోలుకుని జనం మధ్యకు రావాలని ఆకాంక్షించారు.

పంట పొలాల్లో పులి పాదముద్రలు ?



పంట పొలాల్లో ఉన్న పాదముద్రలు

అర్ధవీడు (కంభం): మండలంలోని బొల్లుపల్లి గ్రామంలోని పంట పొలాల్లో పులి పాదముద్రలు ఉన్నాయంటూ సోషల్ మీడియాలో ఫొటోలు వస్తుండటంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఫారెస్టు సిబ్బంది పంట పొలాల్లో ఉన్న పాదముద్రలు పరిశీలించి భయపడాల్సిన పనిలేదని, అవి పులివి కాదన్నారు. పరిసర ప్రాంతాల్లో ట్రాప్ కెమెరాలు అమర్చి పరిశీలిస్తున్నట్లు ఫారెస్టు సిబ్బంది తెలిపారు.

విద్యార్థులకు పోటీలు

ఒంగోలు: కేంద్ర ప్రభుత్వ పాఠశాల విద్య, అక్షరాస్యత విభాగం చేపడుతున్న ఖాదీ మహోత్సవ్ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని సమగ్రశిక్ష అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్ వీఎస్ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన పోటీల విభాగంలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. ఈనెల 26న పాఠశాల స్థాయిలో, 27న మండల స్థాయిలో నిర్వహిస్తారన్నారు. 28న జిల్లా స్థాయిలో నిర్వహించి వివరాలను సమగ్రశిక్ష కార్యాలయానికి ఈనెల 29వ తేదీ లోపు పంపాలని ఆదేశించారు.


6న మార్కాపురంలో పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

మార్కాపురం: మార్కాపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో నవంబరు 6వ తేదీన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సీసీఐ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్‌యార్డు చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ జి కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. పత్తిని అమ్మే రైతులు ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలని ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్‌లు చేయించుకోవాలన్నారు. బన్నీ రకం కనీస మద్దతు ధర రూ.7020 గా కొనుగోలు చేస్తారని, 8 శాతం తేమ ఉండాలని తెలిపారు. 9 శాతం తేమ ఉంటే రూ.6949, 10 శాతం ఉంటే రూ.6,879.60కు కొనుగోలు చేస్తామన్నారు. తేమశాతం పెరిగేకొద్దీ ధర తగ్గుతుందని చెప్పారు. పింజ పొడవు, మైక్రోనైర్ బట్టి కనీస మద్దతు ధర ఉంటుందన్నారు. యార్డుకు పత్తి తెచ్చే రైతులు వాడుకలో ఉన్న బ్యాంకు ఖాతా నంబరు ఆధార్ నంబరుతో అనుసంధానం అయిన అకౌంటు వివరాలను తీసుకొనిరావాలని తెలిపారు. మార్కెట్‌కు తీసుకొచ్చే సమయంలో పత్తిపైన నీళ్లు చల్లరాదని సూచించారు.

అమ్మకు అండగా..

అవసరమున్నా..లేకున్నా సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్న ఈ రోజుల్లో తల్లీ బిడ్డల క్షేమం కోరి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. గర్భం దాల్చిన క్షణం నుంచి కాన్పు వరకూ వైద్యసేవలన్నీ ఉచితంగానే అందిస్తోంది. సుదీర్ఘ అనుభవమున్న గైనకాలజిస్టులు 24 గంటలూ అందుబాటులో ఉంటూ తల్లీబిడ్డలను కంటికి రెప్పలా కాపాడుతున్నారు. సేవలన్నీ ఉచితంగా అందుతుండడంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు ప్రభుత్వ ఆస్పత్రులనే ఆశ్రయిస్తున్నారు.

- కాన్పులు ఉచితం
- అవసరమైతేనే సిజేరియన్ ఆపరేషన్లు
- ఒంగోలులో అందుబాటులో ఆరుగురు గైనకాలజిస్టులు
- నవమాసాలూ నాణ్యమైన వైద్య సేవలు
- బరువు తక్కువ పిల్లలకు మెరుగైన వైద్యం



ఒంగోలు టౌన్/మార్కాపురం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య ఆరోగ్య రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చింది. పేదలకు సకాలంలో మెరుగైన వైద్యం అందేలా చర్యలు చేపట్టింది. ప్రధానంగా మాతాశిశు సంరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. ప్రభుత్వ వైద్యశాలల్లోనే కాకుండా ప్రత్యేకంగా ఉన్న మాతా శిశు వైద్యశాలల్లో వైద్యుల కొరత లేకుండా చేసింది. జిల్లాలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో మొత్తం 12 వైద్యశాలలు ఉన్నాయి. ఇందులో మార్కాపురంలో జిల్లా వైద్యశాల, ఒంగోలులో మాతశిశు వైద్యశాలతో పాటు కనిగిరి, దర్శి, పొదిలి, చీమకుర్తి, పామూరు, దోర్నాల, కంభం, కొండపి, గిద్దలూరు, యర్రగొండపాలెం ఏరియా వైద్యశాలలు ఉన్నాయి. ఈ వైద్యశాలలన్నీ వైద్య విధాన పరిషత్ కోఆర్డినేటర్ పరిధిలో ఉండగా డీఎంహెచ్‌ఓ పరిధిలో 64 పీహెచ్‌సీలు ఉన్నాయి. జిల్లాలో బేస్తవారిపేటలో అత్యధికంగా నాలుగు పీహెచ్‌సీలు ఉన్నాయి. వీటిల్లో కాన్పులు చేస్తున్నారు. కాన్పుల అనంతరం తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌లో సురక్షితంగా ఇంటికి చేరుస్తున్నారు.

ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలలో ఆరుగురు సుశిక్షితులైన గైనకాలజిస్టులు ఉన్నారు. ముగ్గురు చిన్నపిల్లల వైద్యులు, ఇద్దరు మత్తు డాక్టర్లు పని చేస్తున్నారు. ఇటీవలే ఇక్కడ పనిచేస్తున్న సివిల్ సర్జన్ రిటైర్డ్ అయ్యారు. ఆయన స్థానంలో కొత్తగా మరో సివిల్ సర్జన్‌ను నియమించారు. 50 పడకల ఈ వైద్యశాలలో ఆధునిక సౌకర్యాలతో లేబర్ రూం ఉంది. అప్పుడే పుట్టిన పిల్లలకు ఏమైనా ఆరోగ్య సమస్యలు కనిపిస్తే తక్షణ వైద్య సేవలు అందించేందుకు 10 పడకలతో ఎస్‌ఎన్‌సీయూ కూడా అందుబాటులో ఉంది. ఈ ఎస్‌ఎన్‌సీయూలో నిత్యం చిన్నపిల్లల వైద్యులు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేశారు. దీనికి తోడు ఇప్పుడు నాడు-నేడు కింద అదనంగా మరో నూతన భవనాన్ని నిర్మిస్తున్నారు. ఇది ప్రారంభమైతే అదనంగా 20 పడకలు, రెండు లేబర్ రూంలు కూడా అందుబాటులోకి వస్తాయి. త్వరలోనే ఈ భవనాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరావు తెలిపారు. అలాగే మార్కాపురం జిల్లా వైద్యశాలలో ముగ్గురు గైనకాలజిస్టులు, ఇద్దరు సర్జన్‌లతో పాటు, ఇద్దరు అనస్థీషియన్లు (మత్తు డాక్టరు), నిపుణులైన నర్సింగ్ స్టాఫ్ ఉండడంతో నెలకు సుమారు 230 నుంచి 250 మధ్య కాన్పులు జరుగుతున్నాయి. ఆధునిక వైద్య పరికరాలు, ఆక్సిజన్ సౌకర్యం, బ్లడ్ బ్యాంక్, ఐసీయూ బెడ్లు సైతం అందుబాటులో ఉండడంతో సమీప మండలాల్లోని గ్రామాల గర్భిణులు జిల్లా వైద్యశాలలకు డెలివరీ కోసం వస్తున్నారు.



మార్కాపురం జిల్లా ఆసుపత్రిలో సాధారణ కాన్పు చేస్తున్న డాక్టర్ల బృందం (ఫైల్)



ఒంగోలులోని మాతా శిశు వైద్యశాల

సాధారణ కాన్పులే ఎక్కువ...

అవసరమున్నా, లేకపోయినా సిజేరియన్ ఆపరేషన్లు చేస్తున్న ఈ రోజుల్లో ఇక్కడ మాత్రం సాధారణ కాన్పులే చేస్తుండడం గమనార్హం. ఒంగోలు మాతాశిశు వైద్యశాలలో జనవరి నుంచి అక్టోబర్ నెల ఇప్పటి వరకూ చేసిన కాన్పుల్లో 60 శాతానికి పైగా సాధారణ కాన్పులు చేసి ఇక్కడి వైద్యులు రికార్డు సృష్టించారు. మొత్తం 879 కాన్పులు చేయగా అందులో 546 సాధారణ కాన్పులే.. ఇక్కడ చివరి నిముషం వరకు సాధారణ కాన్పు చేసేందుకే ప్రయత్నిస్తామని సీనియర్ గైనకాలజిస్ట్ డాక్టర్ సంపూర్ణమ్మ చెబుతున్నారు. ఇక మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలలో అయితే 1035 కాన్పుల్లో 500కు పైగా సాధారణ కాన్పులు కాగా మిగిలినవని అత్యవసర పరిస్థితుల్లో సిజేరియన్ డెలివరీలు చేశారు.

స్కానింగులు, రక్త పరీక్షలు ఇక్కడే:

నగరంలోని మాతా శిశు వైద్యశాల ఆవరణలోనే రక్త పరీక్షలు చేసేందుకు క్లినికల్ లేబొరేటరీ, స్కానింగు సెంటర్లు ఉన్నాయి. ఐసీటీసీ సెంటర్, బ్లడ్ స్టోరేజి యూనిట్ కూడా అందుబాటులో ఉంది. నెల తప్పిన తరువాత నుంచి కాన్పు జరిగేంత వరకు ప్రతి నెలా వైద్య పరీక్షల కోసం గర్భిణులకు అవసరమైన రక్త పరీక్షలు, స్కానింగ్ చేస్తారు. హిమోగ్లోబిన్, బ్లడ్‌షుగర్, హెచ్‌ఐవీ, హెపటైటిస్ బీ, యూరిన్ ఆల్బుమిన్ పరీక్షలతో పాటుగా అల్ట్రా స్కానింగ్ చేస్తున్నారు. ఈ పరీక్షలను బయటి ఆస్పత్రుల్లో చేయించుకోవాలంటే కనీసం రెండు వేల రూపాయలకు పైగానే ఖర్చవుతుంది. కానీ ఇక్కడ ఖరీదైన పరీక్షలన్నింటినీ ఉచితంగా చేస్తున్నారు.



మార్కాపురం ప్రభుత్వాస్పత్రుల్లో కాన్పు చేయించుకున్న బోడపాడుకు చెందిన మరియమ్మ



ఒంగోలు మాతాశిశు వైద్యశాలలో సుఖప్రసవం అయిన ఒంగోలుకు చెందిన టి.వెంకమ్మ

నయాపైసా ఖర్చు లేకుండా...

ప్రైవేటు వైద్యశాలల్లో కాన్పులు చేయించుకోవాలంటే చాలా ఖర్చు చేయాల్సి వస్తుంది. ఎంత ఖర్చు చేసినా సిజేరియన్ తప్పడం లేదు. సాధారణ కాన్పులకు సైతం రూ.15 నుంచి రూ.20 వేలు తీసుకుంటున్నారు. అదే సిజేరియన్ అయితే రూ.30 నుంచి రూ.50 వేలు ఖర్చు చేయాల్సి వస్తుంది. అయితే ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పైసా కూడా తీసుకోకుండా డిశ్చార్జ్ సమయంలో జననీ సురక్ష సమగ్ర యోజన కింద రూ.1000 నుంచి రూ.1100 వరకు నగదు ఇస్తున్నారు.

పసిపిల్లలకు ఎస్‌ఎన్‌సీయూ చికిత్స

ఒంగోలులోని మాతా శిశు వైద్యశాలలో నవజాత శిశువులకు అవసరమైన అత్యవసర చికిత్సలకు అన్నీ రకాల సౌకర్యాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నెలలు తక్కువగా పుట్టిన పిల్లల్లో సహజంగా బరువు తక్కువగా ఉంటుంది. ఇలాంటి వారికోసం అత్యవసర చికిత్స కోసం బయటి ఆస్పత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే ఇక్కడే చికిత్స చేసేందుకు తగిన ఏర్పాటు చేశారు. చిన్న పిల్లల్లో ఆయాసం, విరేచనాలు, కామెర్లు, ఇతర ఇన్‌ఫెక్షన్లకు నాణ్యమైన వైద్య చికిత్సలు చేసేందుకు ఇక్కడ ముగ్గురు పీడియాట్రిక్ వైద్యులు అందుబాటులో ఉన్నారు. చిన్నపిల్లల క్రిటికల్ కేర్ యూనిట్‌లో ఇక చిన్నపిల్లల డాక్టర్ ఎప్పుడూ ఉంటారు. ప్రస్తుతం ప్రతినెలా 60 ననుంచి 70 మంది పసిపిల్లలకు అత్యవసర వైద్య చికిత్సలు చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు.

అన్నీ రకాల సౌకర్యాలు ఉన్నాయి



ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు ఎంతో ఖర్చు చేస్తోంది. అన్నీరకాల ఆధునిక వైద్య పరికరాలను సమకూరుస్తోంది. తల్లీ బిడ్డల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తోంది. ఉచితంగా వైద్యం చేయడమే కాకుండా ప్రతి నెలా ఉచితంగా రక్త పరీక్షలు, స్కానింగులు చేస్తారు. కాన్పులు కూడా ఉచితంగా చేస్తున్నాం. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ వెంకటరావు, మెడికల్ ఆఫీసర్, మాతాశిశు వైద్యశాల ఒంగోలు

హైరిస్క్ అయితేనే సిజేరియన్



హైరిస్క్ అయితేనే వైద్యశాలలో సిజేరియన్ చేస్తున్నాం. ఉమ్మనీరు తగ్గినా, సీపీడీ లేకపోయినా, కడుపులో బిడ్డ పెద్దగా ఉన్నా, గతంలో డెలివరీ సిజేరియన్ చేసినా, డెలివరీకి వచ్చిన మహిళ కాస్త పొట్టిగా ఉన్నా, ఆలస్యంగా గర్భం దాల్చినా ఇటువంటి కేసుల్లో మాత్రమే సిజేరియన్లు చేస్తారు. మందుల కొరత లేదు.

– డాక్టర్ సుబ్బారెడ్డి, సూపరింటెండెంట్, జిల్లా వైద్యశాల, మార్కాపురం

ఇక్కడ సాధారణ కాన్పులు చేస్తున్నారని తెలిసి వచ్చాం



ప్రైవేటు వైద్యశాలలకు తీసుకెళితే సిజేరియన్ ఆపరేషన్ చేయాలంటున్నారు. ఊర్లో తెలిసిన వాళ్లను అడిగితే ఒంగోలు మాతా శిశు వైద్యశాలతో సాధారణ ప్రసవాలు చేస్తున్నారని చెప్పారు. అందుకే మా అమ్మాయిని కాన్పు కోసం ఇక్కడికి తీసుకొని వచ్చాను. వెంటనే డాక్టర్లు మెరుగైన వైద్యసేవలందించి సాధారణ కాన్పు చేశారు.

– చుండి ఎస్తేరమ్మ, జయవరం, టంగుటూరు మండలం.

మంచి వైద్య సేవలు అందాయి



కాన్పు కోసం మార్కాపురం జిల్లా వైద్యశాలకు వచ్చాను. డాక్టర్లు, నర్సులు మంచి వైద్య సేవలు అందించి సాధరణ కాన్పు చేశారు. బాబు పుట్టాడు. ఒక్క రూపాయి ఖర్చు కాలేదు. మంచి మందులు ఇచ్చారు. డాక్టర్లకు ధన్యవాదాలు.

– హెమీమా, బొమ్మలాపురం, పెద్దదోర్నాల మండలం

హత్య కేసులో ఇద్దరికి యావజ్జీవ శిక్ష

- హత్యకేసులో నిందితులు ఏడుగురికి పదేళ్ల జైలుశిక్ష
- ఇందులో సాక్ష్యాధారాలు తారుమారు చేసిన మరో నలుగురికి ఏడేళ్లు కఠిన కారాగార శిక్ష

ఒంగోలు: హత్యకేసులో ఇద్దరికి యావజ్జీవ జైలుశిక్ష విధిస్తూ 8వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి డి.అమ్మనరాజా బుధవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం కందుకూరు వాసవీ కాలనీకి చెందిన సోమిశెట్టి శ్రీస్రవంతి, బొప్పూడి శ్రీనివాస్‌లు ప్రేమించి పెద్దల అభీష్టానికి వ్యతిరేకంగా వివాహం చేసుకున్నారు. దీనిమీద యువతి తండ్రి కందుకూరు పోలీసుస్టేషన్‌లో కిడ్నాప్, దొంగతనం కేసులు నమోదు చేయగా వాటిలో కిడ్నాప్ కేసు తప్పుడు ఫిర్యాదుగా దర్యాప్తు అనంతరం తీసివేశారు. దొంగతనం కేసుపై హైకోర్టులో స్టే ఇచ్చారు. దీంతో ప్రేమించుకున్న ఇద్దరికి బొప్పూడి శ్రీనివాస్ సోదరుడు స్వామి అండగా ఉంటున్నాడని భావించి అతనిని హత్య చేయాలని యువతి తండ్రి, సోదరుడు భావించారు. అందులో భాగంగా 2012లో సోమిశెట్టి ఉదయ్‌సాగర్, అతని స్నేహితులు టీఆర్‌ఆర్ కాలేజీలో ఉన్న స్వామిని కిడ్నాప్ చేశారు. అనంతరం ఉదయ్‌సాగర్ అద్దెకు తీసుకున్న బియ్యపు గోడౌన్‌లో హత్యచేసి మృతదేహాన్ని భోగనంపాడు సమీపంలోని గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి పొలంలో పూడ్చిపెట్టారు. దీనిపై సంబంధిత గ్రామ వీఆర్‌వో పొన్నలూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అప్పటి ఎస్సై శ్రీహరి కేసు నమోదు చేయగా సీఐ కరుణాకర్, ఆక్కేశ్వరరావులు కేసు దర్యాప్తుచేసి చార్జిషీటు వేశారు. ఇందులో ఒక నిందితుడు మృతిచెందగా మిగిలిన 8 మందిలో ఏడుగురిపై నేరం రుజువైనట్లుగా పేర్కొంటూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు. ఐపీసీ సెక్షన్ 364 కిడ్నాప్ కేసు కింద సోమిశెట్టి ఉదయ్‌సాగర్, పాలడుగు రాఘవరావు అలియాస్ రాఘవ, కొచ్చెర్ల నాగార్జున, షేక్ ఖాజా అలియాస్ బాంబే, యనమల మహేష్, చింతరబోయిన సాయిరాం, సాలి నరేష్‌లకు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. ఐపీసీ 302 సెక్షన్ ప్రకారం హత్యానేరం కింద సోమిశెట్టి ఉదయ్‌సాగర్, పాలడుగు రాఘవరావు అలియాస్ రాఘవలకు యావజ్జీవ జైలుశిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధించారు. ఐపీసీ 201 సెక్షన్ కింద హత్యాస్థలంలో సాక్ష్యాలను మాయం చేసినట్లుగా పేర్కొంటూ సోమిశెట్టి ఉదయ్‌సాగర్, కొచ్చెర్ల నాగార్జున, షేక్ ఖాజా అలియాస్ బాంబే, యనమల మహేష్‌లకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, మరో వెయ్యి రూపాయల జరిమానా విధించారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చావలి రమేష్‌బాబు వాదనలు వినిపించగా కోర్టు లైజన్ ఆఫీసర్‌గా బి.సత్యశ్రీనివాస్ వ్యవహరించారు.

కనిగిరి ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించిన జాన్ ఇర్విన్

కనిగిరి రూరల్: కనిగిరి ఆర్డీఓగా పాలపర్తి జాన్ ఇర్విన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఆర్డీఓ అజయ్ కుమార్ బదిలీపై వెళ్లిన సంగతి విదితమే. ఈ మేరకు నూతన ఆర్డీఓ పీ జాన్ ఇర్విన్‌ను మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణ రావు, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, ఉద్యోగ సంఘాల నాయకులు వేర్వేరుగా కలిసి, పుష్ప గుచ్ఛాలు అందచేసి, శాలువాలతో ఘనంగా సన్మానించారు.



ఆర్డీఓ పీ జాన్ ఇర్విన్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ గఫార్, కమిషనర్ నారాయణరావు

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

- గ్రానైట్ ఓవర్‌లోడ్ వాహనాలను నిలువరించాలి
- రహదారుల వెంట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: రోడ్డు ప్రమాదాల నివారణకు పక్కా చర్యలు తీసుకోవాలని, ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రకాశం భవనంలో బుధవారం రహదారి భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రానైట్ ఓవర్ లోడ్‌తో వెళుతున్న వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోవాలని ఓవర్ లోడ్ వాహనాలను నివారించాలన్నారు. రహదారుల వెంట తగిన హెచ్చరిక బోర్డులు రేడియం స్టిక్కర్‌తో ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేట్ బస్సులు అద్దంకి బస్టాండ్ నుంచి టీబీ రోడ్డు వెనుక సమైఖ్యతనగర్ వద్ద తాత్కాలికంగా ప్రయాణికులను ఎక్కించుకునేలా చూడాలన్నారు. చీమకుర్తి వైపు నుంచి వచ్చే భారీ వాహనాలను కర్నూలు రోడ్డు జంక్షన్ నుంచి గుంటూరు రోడ్డువైపుగా కిమ్స్ హాస్పిటల్ జంక్షన్ నుంచి నేషనల్ హైవేపై వెళ్లేలా సమావేశంలో అనుమతిని మంజూరు చేశారు. నగరంలో తిరిగే ఆటోలకు సంబంధించి ఆటో యూనియన్‌లతో సమావేశం నిర్వహించి ప్రయాణికులను ఎక్కించుకునే పాయింట్లను నగరంలో ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఉపరవాణా కమిషనర్ ఆర్ సుశీల, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ డీఎస్పీ, ఆర్ అండ్‌బీ అధికారులు, వైద్య ఆరోగ్య శాఖ, హైవేస్, ఆర్టీసీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

40 శాతం సబ్సిడీపై నాణ్యమైన విత్తనాల సరఫరా

- సన్న, చిన్నకారు రైతులను దృష్టిలో ఉంచుకునే అదనపు సబ్సిడీ
- జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

ఒంగోలు సెంట్రల్: పంటల సాగుకు వినియోగించే విత్తనాలకు, బహిరంగ మార్కెట్‌లో ఆహార పదార్థాల కోసం వినియోగించే శనగ విత్తనాలతో కొంత వ్యత్యాసం ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలో శనగ విత్తనాలపై ఓ పత్రికలో వచ్చిన కథనంపై ఆయన వివరణ ఇచ్చారు. విత్తనాల కోసం వినియోగించే విత్తనాలు శుద్ధి చేసి ప్రాసెసింగ్, ప్యాకింగ్ చేసేందుకు అదనపు ఖర్చులు ఉంటాయన్నారు. అందువల్లే ధరల వ్యత్యాసం ఉంటుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసే శనగ విత్తనాలు ఇండియన్ మినిమం సీడ్ సర్టిఫికేషన్ స్టాండెడ్ (ఐఎంఎస్‌సీఎస్) -2013 నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలతో ఉంటాయని తెలిపారు. శనగ విత్తనాల ధరలు రాష్ట్ర స్థాయి ధరల కమిటీ నిర్ణయించిన మేరకు ఉంటాయని చెప్పారు. సెప్టెంబర్ 15 నాటికి అప్పటి మార్కెట్ ధరలు అనుసరించి విత్తనాల సేకరణ, ప్రాసెసింగ్, రవాణాకు సంబంధించిన ఖర్చులతో కలిపి జీజే-11 రకం విత్తనాలు రూ.8,100, కాగ్-2 రకం విత్తనాలు రూ.14,050 క్వింటాకు నిర్ణయించారన్నారు. గత ఏడాది 25 శాతం సబ్సిడీ ఉన్న విత్తనాలకు, వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా సన్న, చిన్నకారుల రైతులకు దృష్టిలో ఉంచుకుని 40 శాతం సబ్సిడీగా రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు విత్తన సరఫరా చేస్తున్నట్లు వివరించారు.

సత్తాచాటిన జిల్లా ఎడ్ల జతలు

రాచర్ల: మండలంలోని ఆకవీడు గ్రామంలో శిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా మంగళవారం ఉదయం 9 గంటల సమయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్ పెద్దబండ ఎడ్ల బండలాగుడు పోటీల్లో టంగుటూరు గ్రామానికి చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్ల జతలు సత్తాచాటాయి. ఈ ఎడ్ల పోటీల్లో మొత్తం 11 జతల ఎడ్లు పాల్గొనగా టంగుటూరు గ్రామానికి చెందిన మక్కెన కోటేశ్వరరావు ఎడ్ల జతలు నిర్ణీత 20 నిమిషాల్లో 2094 అడుగులు లాగి మొదటి బహుమతి సాధించాయి. అదేవిధంగా వైఎస్సార్ జిల్లా వల్లూరు మండలం బాలుగారిపల్లె గ్రామానికి చెందిన ఇందిరెడ్డి రమణారెడ్డి ఎద్లు 2022 అడుగులు లాగి రెండో బహుమతి, నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పి.ఆర్‌పల్లె గ్రామానికి చెందిన ఎమ్.నాగయ్య ఎడ్ల జతలు 1937 అడుగులు లాగి మూడో బహుమతి, వైఎస్సార్ జిల్లా కమలాపురం మండలం కమలాపురం గ్రామానికి చెందిన తోట కుమారి ఎడ్ల జతలు 1846 అడుగులు లాగి నాల్గవ బహుమతి, కృష్ణ జిల్లా ఘంటసాల మండలం ఘంటసాల గ్రామానికి చెందిన ఎం. కృష్ణమోహన్ ఎడ్ల జతలు 1842 అడుగులు లాగి ఐదో బహుమతి సాధించాయి. ఎడ్లపోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతిగా రూ. 60 వేలు, రెండో బహుమతి రూ.40, మూడో బహుమతి 30, నాల్గవ బహుమతిగా 20, ఐదో బహుమతిగా రూ.10 వేలను ఎడ్ల యజమానులకు పంపిణీ చేశారు.



ఆకవీడులో బండలాగుతున్న ఎడ్ల జతలు

క్లుప్తంగా

రోజుకో పంచాయతీ సందర్శించండి

● ఈఓపీఆర్డీలకు డీపీఓ ఆదేశం


మాట్లాడుతున్న డీపీఓ నారాయణరెడ్డి

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని ఈఓపీఆర్డీలు రోజు తమ పరిధిలోని ఒక పంచాయతీని తప్పనిసరిగా సందర్శించాలని జిల్లా పంచాయతీ అధికారి(డీపీఓ) జీవీ నారాయణరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన కార్యాలయం నుంచి డీపీఓ బుధవారం ఈఓపీఆర్డీలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వమిత్వ యోజన సర్వే కచ్చితంగా చేపట్టాలని స్పష్టం చేశారు. అవగాహన కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలని చెప్పారు. పంచాయతీ అభివృద్ధి సూచికలో ఎస్‌డీజీ లక్ష్యాలు, పేదరికం లేని, మెరుగైన జీవనోపాధి గ్రామం తదితర అంశాలపై చర్చించారు. ఇంటి పన్నును డిసెంబర్ 31వ తేదీలోగా నూరు శాతం వసూలు చేయాలని చెప్పారు. నివేదికలు ఎప్పటికప్పుడు డివిజనల్ పంచాయతీ అధికారులకు అందించాలని ఆదేశించారు. జిల్లా పంచాయతీ కార్యాలయ పరిపాలన అధికారి ఎస్‌శివప్రసాద్, డివిజనల్ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల్లో ఈ-క్రాప్ జాబితాల ప్రదర్శన

● జిల్లాలో 3,54,351 ఎకరాల్లో ఈ క్రాప్ నమోదు


ఒంగోలు సెంట్రల్: జిల్లాలో 3,54,351 ఎకరాల్లో సాగైన పంటలు ఈ క్రాప్‌లో నమోదైనట్లు జిల్లా వ్యవసాయాధికారి ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు ఈ క్రాప్ నమోదు ముసాయిదా జాబితాలను ప్రదర్శిస్తామన్నారు. గ్రామసభలు కూడా నిర్వహించి ముసాయిదా జాబితాలను సభల్లో చదివి వినిపిస్తారని తెలిపారు. ఈ- క్రాప్‌కు సంబంధించిన అభ్యంతరాలు ఏమైనా ఉంటే రైతులు ఆయా సచివాలయాల పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ క్రాప్-2023 ఖరీఫ్‌కు సంబంధించి జాబితా సవరణకు ఆఖరి అవకాశం అని చెప్పారు. రైతులు ఏమైనా తప్పులు దొర్లితే సరి చేసుకోవాలని సూచించారు.

అదృశ్యమైన వ్యక్తి మృతి


పాలుగుళ్ల రామ్మోహన్‌రెడ్డి(ఫైల్)

రాచర్ల: వారం రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన మతిస్థిమితం లేని వ్యక్తి బుధవారం రాచర్ల మండలం కాలువపల్లె సమీపంలో శవమై కనిపించాడు. గొర్రెల కాపరుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు.. ఆ మృతదేహం పాలుగుళ్ల రామ్మోహన్‌రెడ్డి(69)దిగా గుర్తించారు. పోలీసులు, బంధువుల కథనం మేరకు వివరాలు.. కాలువపల్లె గ్రామానికి చెందిన పాలుగుళ్ల రామ్మోహన్‌రెడ్డికి కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదు. ఆయన ఈ నెల 18వ తేదీన కాలువపల్లె నుంచి రాచర్ల వైపునకు సైకిల్‌పై వెళ్లారు. అప్పటి నుంచి కనపించడం లేదని బంధువులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వారం రోజులుగా పోలీసులు రాచర్ల, కాలువపల్లె పరిసర ప్రాంతాల్లో బావులు, చెరువుల వద్ద గాలిస్తున్నారు. రామ్మోహన్‌రెడ్డి ఆచూకీ తెలియజేయాలని కోరుతూ ఆయన ఫొటోతో కూడిన పోస్టర్లను మండలంలోని పలు ప్రాంతాల్లో అంటించారు. ఇదిలా ఉండగా బుధవారం కాలువపల్లె గ్రామ సమీపంలో వెలిగొండ ప్రాజెక్టు కాలువకు సంబంధించిన పైపులైన్ వద్ద ఓ మృతదేహాన్ని గొర్రెల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని గిద్దలూరు సీఐ దేవప్రభాకర్, రాచర్ల ఎస్సై జి.కృష్ణపావని పరిశీలించారు. ప్రమాదవశాత్తు సైకిల్ పైనుంచి కింద పడి రామ్మోహన్‌రెడ్డి మృతి చెంది ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఏఐటీయూసీ వార్షికోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కొత్తకోట వెంకటేశ్వర్లు

ఒంగోలు టౌన్: సుదీర్ఘ పోరాటాలు, ఉద్యమాల ద్వారా అనేక కార్మిక చట్టాలను సాధించిన ఏఐటీయూసీ 104వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మల్లయ్యలింగం భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశంలోని కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా బహుళజాతి కంపెనీలకు కట్టబెట్టడం వల్ల అనేక మంది ఉద్యోగాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. 12 గంటల పనిదినాలతో వెట్టి చాకిరీ చేయిస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపే సమయం ఆసన్నమైందన్నారు. సమావేశంలో పీవీఆర్ చౌదరి, ఎస్‌డీ యాసిన్, కె.హనుమంతరావు, గుజ్జుల బాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బావుటా

● గ్రామాల్లో జోరుగా అభివృద్ధి పనులు
● జిల్లాకు రూ.24.60 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ
● మండలానికి రూ.60 లక్షల చొప్పున నిధులు
● 36 మండలాల్లోని గ్రామాల్లో 460 పనులు మంజూరు
● పశ్చిమ ప్రకాశంలో రూ.9 కోట్లతో అభివృద్ధి పనులు
● పల్లెల్లో కనీస సౌకర్యాల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం చర్యలు



వేములకోట సచివాలయం

మార్కాపురం: టీడీపీ జమానాలో జన్మభూమి కమిటీలతో జవసత్వాలు కోల్పోయిన గ్రామ పంచాయతీ వ్యవస్థకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఊపిరిలూదుతున్నారు. పల్లెల్లో సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా సమాంతరంగా ఉండాలని భావించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు భారీగా నిధులు కేటాయించింది. ఫలితంగా పల్లెల్లో అభివృద్ధి పరుగులు తీస్తోంది. జిల్లాలో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు కూడా సమాంతరంగా సాగుతున్నాయి. గ్రామాల్లో కనీస సౌకర్యాల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిశాఖ ద్వారా ప్రతి మండలానికి 60 లక్షల రూపాయల నిధులు కేటాయించింది. ఈ ఉత్తర్వులు జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డిస్ట్రిక్ట్ వాటర్ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ) ద్వారా ఉత్తర్వులు జారీ అయ్యాయి. అన్ని మండలాల నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు ప్రతిపాదనలు పంపాలని ఇప్పటికే ఆదేశాలిచ్చారు.

జిల్లాకు సంబంధించి మొత్తం 24.60 కోట్ల రూపాయలను కేటాయించగా.. 460 పనులకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ పనులు చేపట్టనున్నారు. జిల్లాలో పశ్చిమ ప్రకాశంలో మార్కాపురం, యర్రగొండపాలెం, గిద్దలూరు నియోజకవర్గాల్లోని 15 మండలాల పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు 9 కోట్ల రూపాయలు కేటాయించారు. మిగిలిన నిధులతో కనిగిరి, దర్శి, సంతనూతలపాడు, కొండపి, ఒంగోలు నియోజకవర్గాల్లో పనులు చేపట్టనున్నారు.

అభివృద్ధి పనులు ఇలా..

ప్రధానంగా ఈ నిధులతో గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారు. రోడ్లు లేని ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. అర్ధవీడు మండలంలో 10, బేస్తవారిపేటలో 12, సీఎస్‌పురంలో 5, చీమకుర్తిలో 5, కంభంలో 6, దర్శిలో 9, దొనకొండలో 6, దోర్నాలలో 20, గిద్దలూరులో 12, హనుమంతునిపాడులో 13, కనిగిరిలో 17, కొమరోలులో 8, కొనకనమిట్లలో 9, కొండపిలో 23, కొత్తపట్నంలో 24, కురిచేడులో 8, మద్దిపాడులో 11, మార్కాపురంలో 9, మర్రిపూడిలో 12, ముండ్లమూరులో 8, నాగులుప్పలపాడులో 7, ఒంగోలులో 5, పామూరులో 12, పెద్దారవీడులో 14, పీసీపల్లిలో 10, పొదిలిలో 7, పొన్నలూరులో 17, పుల్లలచెరువులో 14, రాచర్లలో 9, సంతనూతలపాడులో 12, సింగరాయకొండలో 13, టంగుటూరులో 17, తర్లుపాడులో 15, తాళ్లూరులో 12, త్రిపురాంతకంలో 11, వెలిగండ్లలో 20, వైపాలెంలో 23, జరుగుమల్లిలో 14.. వెరసి మొత్తం 460 పనులను ఆమోదించనున్నారు.

ఐటీడీఏ పరిధిలో..

శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని పుల్లలచెరువు, యర్రగొండపాలెం, పెద్దారవీడు, పెద్దదోర్నాల మండలాల్లో మొత్తం 4.87 కోట్ల రూపాయలతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ఇందులో పుల్లలచెరువు మండల కేంద్రం నుంచి చెంచుకాలనీ వరకు సీసీ రోడ్డుకు రూ.40 లక్షలు, వెంకటగిరి చెంచుకాలనీలో సీసీ రోడ్డుకు రూ.24 లక్షలు, సింగుపల్లి చెంచుపల్లిలోని సీసీ రోడ్డుకు రూ.32 లక్షలు, చెన్నపాలెంలో అంగన్‌వాడీ కేంద్రానికి రూ.14 లక్షలు, పాలుట్ల చెంచుకాలనీలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.46 లక్షలు, అల్లిపాలెం చెంచుగూడెంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి రూ.23 లక్షలు, గంజివారిపల్లి నుంచి బావిపెంట చెంచుగూడేనికి రోడ్డు నిర్మాణం కోసం రూ.65 లక్షలతో ప్రతిపాదనలు పంపారు. ఇంకా చిలకచర్ల చెంచుగూడెం, ప్రగళ్లపాడు చెంచుకాలనీల్లో కూడా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. కాగా ఇప్పటికే ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో చెరువులు, కాలువలు బాగుపడ్డాయి.


మొద్దులపల్లిలో నిర్మించిన సీసీ రోడ్డు

వేగంగా అభివృద్ధి పనులు



జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా చేపడుతున్నాం. ప్రతి మండలంలో అభివృద్ధి కార్యక్రమాల నిమిత్తం గ్రామీణాభివృద్ధిశాఖ 60 లక్షల రూపాయలు కేటాయించింది. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. జిల్లా మొత్తం మీద 460 పనులు మంజూరయ్యాయి.

– శీనారెడ్డి, డ్వామా పీడీ, ఒంగోలు

అభివృద్ధిపై దృష్టి



గ్రామ పంచాయతీలో అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టిపెట్టాం. గ్రామీణాభివృద్ధి శాఖ మంజూరు చేసిన నిధులతో ప్రధానంగా సీసీ రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, పారిశుధ్యం తదితర పనులు చేపడతాం. ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా సచివాలయానికి వచ్చిన నిధులతో రోడ్ల నిర్మాణం చేపట్టాం.

– రమణారెడ్డి, బోడపాడు సర్పంచ్

చేసింది చెప్పడం కోసమే..

సామాజిక సాధికార యాత్ర

● రాష్ట్ర మార్కెటింగ్ కోఆపరేటివ్ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి


మాట్లాడుతున్న బత్తుల బ్రహ్మానందరెడ్డి

పర్చూరు (చినగంజాం): అట్టడుగు వర్గాలను ఆర్థిక, సాంఘిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి పథంలో తమ ప్రభుత్వం నడిపించిన వైనాన్ని ప్రజలకు తెలియజెప్పడం కోసమే నేటి నుంచి సామాజిక సాధికార బస్సు యాత్ర ప్రారంభిస్తున్నట్లు మార్కెటింగ్ కో ఆపరేటివ్ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి అన్నారు. నూతలపాడులోని ఆత్రేయ వృద్ధాశ్రమం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామ పంచాయతీ మొదలు శాసన సభ, మండలి వరకు నిర్దేశించిన లక్ష్యాలను మించి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అధికారంలో సింహభాగం అవకాశాలు కల్పించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. దశాబ్దాల తరబడి అధికారానికి ఆమడ దూరంలో ఉంటూ ఆత్మన్యూనతా భావంతో బతుకులు వెళ్లదీస్తున్న బీసీలు, మోస్ట్ బ్యాక్‌వర్డ్ బీసీలు (ఎంబీసీలు) 56 కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి 720 మందిని డైరెక్టర్‌లుగా భాగస్వామ్యం కల్పించి వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. ఇటీవల పార్లమెంట్‌లో ఆమోదం పొందిన మహిళా బిల్లుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రెండు సంవత్సరాలు క్రితమే శాసన సభలో ఆమోదింప జేసి కేంద్రానికి పంపిన విషయం నిజం కాదా? అని ఆయన ప్రశ్నించారు. ప్రకటించిన మేనిఫెస్టోలో 98 శాతం పైగా హామీలు పూర్తి చేస్తే అందులో లబ్ధిదారులు జనాభాలో 60 శాతం పైగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలేనన్నారు. తమ పార్టీకి బీసీలే వెన్నెముక అని తన ఎల్లో మీడియా ద్వారా ఉత్తర ప్రగల్భాలు పలికిన మాజీ సీఎం చంద్రబాబు అండ్ కో ఆచరణలో వారికి రిక్తహస్తం చూపటం ఆయా వర్గాలు మరచిపోలేదని చెప్పారు. లక్షలాది ఎకరాల అసైన్డ్ భూములు, చుక్కల భూముల పరిష్కారం వలన లబ్ధి పొందిన వారు కూడా బడుగు, బలహీన వర్గాలేనని బత్తుల అన్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన జగనన్న సురక్ష, ఆరోగ్య సురక్ష పథకాలు రాష్ట్రంలో విప్లవాత్మక చర్యలు అని కొనియాడారు. రాష్ట్రంలో 32 లక్షల మందికి ఉచిత ఇళ్ళపట్టాలు వాటిలో 22.50 లక్షలు గృహ నిర్మాణాలు 7.50 లక్షల గృహ ప్రవేశాలు నభూతో నభవిష్యతి అని అన్నారు. ప్రజలు గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వ పనితీరుకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించి మరోసారి జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. నేటి నుంచి డిసెంబర్ 31 వరకు 60 రోజుల పాటు రాష్ట్రంలో నిర్వహించనున్న సామాజిక సాధికారత బస్సు యాత్రను ప్రజలు ఆదరించి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు భవనం రాజగోపాలరెడ్డి, గోగినేని బుల్లిబ్బాయి, బెజవాడ స్వామి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాటి ఏడుకొండలు, బడే శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిలువరించాలి


బాల్యవివాహాల నిషేధిత చట్టం ప్రచార పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, అధికారులు, ఎన్‌జీఓ ప్రతినిధులు

● ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే అది సాధ్యం
● అధికారులతో సమీక్షలో కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: జిల్లాలో బాల్య వివాహాలపై ప్రతి నిమిషం అప్రమత్తంగా ఉంటూ పూర్తిగా నిలువరించాలని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ప్రకాశం భవనంలో బాల్య వివాహాల నియంత్రణపై పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బాల్య వివాహాల నిషేధ చట్టం-2006ను పక్కాగా అమలు చేయాలని చెప్పారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ఇంటర్ విద్యను అభ్యసించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామ, మండల స్థాయి నుంచి పంచాయతీ పరిధిలోని అన్నీ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. సచివాలయాల సిబ్బందిని ప్రణాళిక ప్రకారం వినియోగించాలని, ప్రతి వివాహాన్ని రిజిస్టర్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో ప్రాజెక్టు డైరెక్టర్ కె.మాధురి, డీసీపీఓ దినేష్‌కుమార్, డీపీఓ నారాయణరెడ్డి, డీఈఓ సుబ్బారావు, డీఆర్‌డీఏ పీడీ శీనారెడ్డి, దిశ డీఎస్పీ, ఎన్‌జీఓలు పాల్గొన్నారు.

బీజేపీ స్వార్థంతోనే జల వివాదం

ఒంగోలు టౌన్: కృష్ణా జలాల సాధన కోసం కేంద్రం వద్దకు అఖిల పక్షాన్ని తీసుకెళ్లాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. బుధవారం మల్లయ్య లింగం భవన్‌లో కృష్ణా జలాల సాధనపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ.. స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలుగు రాష్ట్రాల ప్రజలతో ఆటలాడుతోందని విమర్శించారు. దేశంలోని ఏ రాష్ట్రంలో ఎన్నికలొచ్చినా మత విద్వేషాలు రెచ్చగొట్టడం లేదా జలవివాదాలు సృష్టించి లబ్ధి పొందేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్నారు. నాడు కర్ణాటకలో, నేడు తెలంగాణలో సాగునీటి ప్రాజెక్టులపై నాటకాలాడుతోందని విమర్శించారు. జిల్లాలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో రైతు నాయకులు రంగారావు, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, చావలి సుధాకర్, సుబ్బారెడ్డి, ఎస్‌డీ సర్దార్, మహంకాళి సుబ్బారావు, మౌలాలి, వీరారెడ్డి, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఈశ్వరయ్య

తాగిన మైకంలో ముగ్గురిపై దాడి

మద్దిపాడు: తాగిన మైకంలో ఆటోకు అడ్డుపడి గొడవ పెట్టుకుని ఆపై స్నేహితులతో కలిసి ఆటో డ్రైవర్, అతని కుటుంబసభ్యులపై దాడి చేసి గాయపరిచారు. ఈ సంఘటన లింగంగుంటలో మంగళవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. లింగంగుంటకు చెందిన పెనుమాక కోటేశ్వరరావు అనే వ్యక్తి ఆటోలో బావమరిది స్నేహితునితో కలిసి గ్రామానికి వెళుతున్న సమయంలో గ్రామానికి చెందిన వేణు అనే యువకుడు మద్యం మత్తులో ఆటోకు అడ్డుగా రావడంతో మాట మాట పెరిగి గొడవ పడ్డారు. ఆ సమయంలో అటుగా వెళుతున్న మహిళ ఇద్దరినీ అరిచి పంపించివేసింది. కానీ ఇంటికి వెళ్లిన వేణు తన స్నేహితులతో కలిసి కోటేశ్వరరావు ఇంటికి వెళ్లి దాడి చేశారు. ప్రహరీని పడేసి పక్కనే ఉన్న రెండు ఆటోల అద్దాలు ధ్వంసం చేశాడు. పక్కనే ఉన్న కోటేశ్వరరావు అత్త సునీత ఇంట్లోకి వెళ్లి ఆమెపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. అనంతరం ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

హైవే పనుల్లో అపశ్రుతి


అభినయ్ మృతదేహం

కందుకూరు: పట్టణ శివారు ప్రాంతంలో జరుగుతున్న జాతీయ రహదారి పనుల్లో అపశృతి చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు నీళ్ల ట్యాంకర్ తిరగబడి యువకుడు అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం....సింగరాయకొండ నుంచి కడప జిల్లా మైదుకూరు వరకు నిర్మిస్తున్న నూతన జాతీయ రహదారి 167బీ పనులు ప్రస్తుతం కందుకూరు పట్టణ శివారు ప్రాంతంలో జోరుగా సాగుతున్నాయి. ఈ క్రమంలో కృష్ణాజిల్లా నందిగామకు చెందిన మంద అభినయ్(18) అనే యువకుడు హైవే పనులు చేస్తున్న కాంట్రాక్టర్ సంస్థ వద్ద పనులకు వచ్చాడు. పనుల్లో భాగంగా బుధవారం సాయంత్రం నీళ్ల ట్యాంకర్ తీసుకుని వచ్చి రోడ్డు క్యూరింగ్ చేస్తున్నాడు. ట్రాక్టర్‌పై ఉండి నీళ్లు పడుతుండగా ట్రాక్టర్ ఒక్కసారిగా జారి కిందకు వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ ఇంజన్ తిరగబడడంతో దానిపై ఉన్న అభినయ్ ట్రాక్టర్ కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మూడు పూరి గుడిసెలు దగ్ధం


చీమకుర్తిలో దగ్ధమైన పూరి గుడిసెలు

చీమకుర్తి: ఇంట్లో గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వ్యాపించటంతో మూడు పూరి గుడిసెలు దగ్ధమయ్యాయి. ఈ ఘటన చీమకుర్తిలోని పిడతలపూడి రోడ్డులో బుధవారం జరిగింది. ప్రమాదంలో గిరిజన కుటుంబాలకు చెందిన దేవరకొండ వెంకటమ్మ, దేవరకొండల అంజమ్మ, దేవరకొండ సుబ్బమ్మకు చెందిన మూడు ఇళ్లు దగ్ధమయ్యాయి. వారిలో వెంకటమ్మ, అంజమ్మకు చెందిన ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. రూ.20 వేల విలువైన రెండు ప్రాంసరీ నోట్లు, టీవీలు, ఫ్రిజ్, దుస్తులు, వంట సామగ్రి కాలి బూడిదయ్యాయి. స్థానికంగా ఉన్న గిరిజన కుటుంబాలకు చెందిన వ్యక్తులు, వైఎస్సార్ సీపీ నాయకుడు దేవరకొండ దుర్గారావు వెంటనే అప్రమత్తమై మోటార్లతో నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవాలని గిరిజన కుటుంబాలు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


శేఖర్ మృతదేహం

కొమరోలు(గిద్దలూరు రూరల్): లారీని ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఎర్రపల్లె గ్రామ సమీపంలో బుధవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పాముదుపల్లె గ్రామానికి చెందిన అంకాల శేఖర్(34) అనే వ్యక్తి పని నిమిత్తం కొమరోలుకు వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న మరో వాహనాన్ని తప్పించబోయి రోడ్డుపై ఆగి ఉన్న లారీని ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. ప్రమాదంలో శేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సోదరి పార్థివదేహానికి మంత్రి సురేష్ ఘన నివాళి


సోదరి పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

మార్కాపురం: రాష్ట్ర పురపాలక శాఖామంత్రి ఆదిమూలపు సురేష్ సోదరి ఆదిమూలపు శైలజ పార్థివదేహానికి మంత్రి సురేష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ రాష్ట్రంలోని భద్రాద్రి కొత్తగూడెంజిల్లా టేకులపల్లి మండలం బొమ్మనపల్లి ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా పనిచేస్తున్న శైలజ(58) గుండెపోటుతో మంగళవారం మృతి చెందగా ఆమె పార్థివదేహాన్ని బుధవారం మార్కాపురం పట్టణంలోని ఏబీఎం కాంపౌండ్‌లో ఉన్న ఆమె నివాసానికి తీసుకొచ్చారు. మంత్రి సురేష్ నివాళులర్పించి కన్నీటిపర్యంతమయ్యారు. శైలజ భర్త అబ్రహం పాల్వంచ డిగ్రీ కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతోపాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయురాలిగా శైలజ అవార్డులు అందుకున్నారు. శామ్యూల్ జార్జి కళాశాల ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ రాజబాబు, శ్యామ్, కౌన్సిలర్ హర్షిత, ఉత్తమ్‌కుమార్ తదితరులు నివాళులర్పించారు.